


# ప్రియురాలు పిలిచె

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



### (గత సంచిక తరువాయి)

**''చూడండి. నేను మీ** అహాన్ని దెబ్బకొట్టానని తెలుసు. ఏ భార్య అయినా భర్తతో 'నీది చేతకానితనం' అని అంటే అంతకన్నా పెద్ద అవమానం ఇంకొకటి ఉండదు. మీ స్థానంలో ఇంకెవరైనా ఉంటే, అక్కడే చెంప బ్రద్దలు కొట్టేవాడు. ఏదైనా చెయ్యండి. మీరేదైనా చెయ్యండి.''

''సరే. నీ చెంప ఇలా ఇవ్వు'' అని వంగి, చెంప మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. కానీ ఆమె దాన్ని ఆస్వాదించే స్థితిలో లేదు. ''మీరేదో ఒకటి చేసే వరకూ నాకు మనశ్శాంతి ఉండదు'' అంది.

''ప్రతిరోజూ ఆఫీసుకు వెళ్తున్నానుగా.''

''ఎందుకు వెళుతున్నారు? కేవలం నన్ను సంతోష పెట్టటానికేగా. చూడండి. ఈ వ్యాపారాలూ, కష్టనష్టాలు నాకు చిన్నప్పటి నుండి ఉన్నవే. అసలు ఇలాంటివి లేకపోతే నాకు తోచదు. వీటి గురించి మీరసలు పట్టించుకోకండి. నాకు వదిలి పెట్టండి.''

''పెట్టి?''

''మీరు మెడిసన్ పూర్తి చెయ్యండి.''

అతడు అదిరిపడి, ''ఇప్పుడా?'' అన్నాడు.

''ఏం? అప్పుడంటే డబ్బు లేదన్నారు. ఇప్పుడు దానికి లోటు లేదుగా.''

''నేను చదువు పూర్తి చెయ్యాలనుకుంటే ఎలాగో ఒకలా చేసి ఉండేవాడిని. నా కందులో ఉత్సాహం లేదు కళ్యాణీ. చాలామంది డాక్టర్లు పెద్ద పెద్ద చదువులు చదివి కూడా వ్యాపారాలు పెట్టుకుంటారు ఎందుకు? ఆ వృత్తిమీద ఉత్సాహం లేక. నాకు చదువుతూండగానే దాని మీద ఉత్సాహం పోయింది.''

''మీకు చిత్రలేఖనం తప్ప మరేమీ ఇంటరెస్టు లేదుకదూ''. అతడు సమాధానం చెప్పలేదు. ''మీకు ఆ ఏర్పాట్లన్నీ ఇక్కడే చేస్తాను. మొదలు పెట్టండి'' అభ్యర్థిస్తున్నట్టూ అడిగింది.

అతడు ఆమె వైపు నిర్లిప్తంగా చూశాడు. *'నాలో ఎక్కడో ఏదో ఆగిపోయిందని నీకెలా చెప్పను కళ్యాణీ?'* అనుకున్నాడు. మనసు ఘర్షణ ఎరుపో – హృదయ స్పందన పసుపో... కళామతల్లి కాలికి పారాణి వ్రాయాలంటే పచ్చటి సంతోషమో... ఎర్రటి వేదనో... ఏదో ఒకటి ఉండాలి.

5

**''కూర్చోండి''** అన్నాడు డాక్టర్ భరద్వాజ. వివేకానంద ఎదురు సీట్లో కూర్చుంటూ, ''ఏమిటి చాలా అర్జెంటుగా మాట్లాడాలని కబురు చేశారు?'' అన్నాడు నవ్వుతూ. భరద్వాజ నవ్వలేదు. మౌనంగా చూస్తూ ఉండిపోయాడు.

''ఏమిటి డాక్టర్? నా రిపోర్టుల్లో ఏమైనా తేడా వచ్చిందా?''

భరద్వాజ నెమ్మదిగా అన్నాడు, ''మీ రిపోర్టుల్లో కాదు. మీ అమ్మాయి రిపోర్టుల్లో.''

వివేకానంద మొహంలో నవ్వు మాయమైంది. ''ఏమైంది డాక్టర్'' అన్నాడు ఆందోళనగా. భరద్వాజ తన టేబిల్ మీదున్న ఫైల్లోంచి అనూజ్ఞ పరీక్షల తాలూకు రిపోర్టు తీసి ''సారీ వివేకానందగారూ, మీ అమ్మాయి హడ్జ్కిన్స్ డిసీజ్‌తో బాధపడుతూంది'' అన్నాడు.

వివేకానందకి అర్థం కాలేదు. ''... అంటే'' అన్నాడు అయోమయంగా.

''లింఫో బ్లాస్టిక్ సింప్టమ్. చివరి వరకూ తెలీదు. ఆఖరి రోజుల్లోనే అది బయట పడుతుంది.''

''నో – నో'' గొణుగుతున్నాడు వివేకానంద. డాక్టరు కొనసాగించాడు. ''మీ పరీక్షల కోసం వచ్చి, సరదాగా తనూ చేయించుకుంది. అందులో ఇది బయటపడటం దురదృష్టకరం.''

''దానికి మం...''

''హడ్జ్కిన్స్ డిసీజ్‌కి మందు లేదు వివేకానందగారూ. మరణమే.''

''నో...'' అరిచాడు వివేకానంద. ''కోట్లు ఖర్చయినా సరే, ప్రపంచంలోని ఏ దేశానికి తీసుకెళ్ళయినా సరే నా కూతుర్ని బాగుచేయించుకుంటాను.''

భరద్వాజ అతనివైపు సానుభూతితో చూశాడు. ప్రపంచంలో అవతలివాళ్ళకి అత్యంత దురదృష్టకరమైన వార్తలు చెప్పేది ఇద్దరే. 'నీకు ఉరిశిక్ష' అని చెప్పే జడ్జి. 'నువ్వు మరణానికి చేరువలో ఉన్నావు' అని చెప్పే డాక్టరు.

''ఈ 'విషయం మీ అమ్మాయికి చెప్పాలా వద్దా' అని ఇప్పుడు మీరొక నిర్ణయం తీసుకోవాలి''.

వివేకానంద చప్పున తలెత్తి చూశాడు. భరద్వాజ విషాదంగా అన్నాడు. ''అవును. అమ్మాయికి చెప్పేం లాభం? ఎలాగూ మందు లేదు. ఆమెని మానసికంగా కూడా హింసించడం దేనికి? ఏదో మామూలు ట్రీట్‌మెంట్ కొనసాగిస్తామనుకోండి. కానీ ఇంత భయంకరమైన విషయం చెప్పాలా? అని మీరు నిర్ణయించాలి.''

వివేకానంద అక్కడినుంచి లేచాడు. ఒక్కసారిగా పాతిక సంవత్సరాలు పైబడిన వాడిలా నడుస్తూ వెళ్ళిపోతున్న వివేకానందని సానుభూతిగా చూస్తూ ఉండిపోయాడు డాక్టర్ భరద్వాజ.

డాక్టర్ పాల్ నుంచి ఫోన్ వస్తుందేమో అని ఒకటి రెండురోజులు చూసి ఆ విషయం మర్చిపోయింది అనూజ్ఞ. తన రక్తపు రిపోర్టు గురించి ఎవరూ పట్టించుకోలేదనుకుంది.

ఆ సాయంత్రం ఆమె బాల్కనీలో కూర్చుని ఉండగా తండ్రి కారు దిగటం గమనించింది. ఆయన చేతిలో ఒక పుస్తకం ఉంది. దాని పేరు "**గీతాంజలి**". ఒక పేషెంట్‌లాగా ఆయన లోపలికి వస్తూంటే వెళ్ళి కంగారుగా ''ఏం నాన్నా? ఏం జరిగింది?'' అంది.

''ఏం... ఏం లేదమ్మా'' అన్నాడు పుస్తకం బల్ల మీద పెడుతూ. ఆయన మూడ్ మార్చటానికా అన్నట్టు ''నీకో విషయం చెపుతానన్నాగా'' అంది.

''ఏది?''

''చెప్పిన తరువాత కాదనకూడదు'' గారాబంగా అంది. ఆయన కూతురి వైపు తడి కళ్ళతో చూస్తూ మనసులో ''రెండు నెలల్లో మమ్మల్ని వదిలి వెళ్లిపోయే నీ కోసం ఏమి చేయమన్నా చేస్తానమ్మా'' అనుకున్నాడు.

బల్లమీద ఉన్న పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుంది. ఆ పుస్తకపు మొదటి పేజీలో, ''అనూజ్ఞకి... అభినందనల్తో... కార్తికేయ, కళ్యాణి'' అని ఉంది. ఆమె దాన్ని విప్పి ఉంటే ఈ కథ మరోలా మలుపు తిరిగి ఉండేది. వేళ్ళ మధ్య గుండ్రంగా తిప్పుతూ "ఈ పుస్తకం పట్టుకు తిరుగుతున్నవేమిటి? ఎవరిచ్చారు? పేరు బావుంది. అది సర్లే గానీ నాన్నా ... 'ఎవర్నన్నా ప్రేమించావా?' అని అడిగావుగా 'తనూ..." అంటూ కార్తికేయతో సిమ్లాలో తనకి జరిగిన పరిచయం, అది ప్రేమగా మారటం, తనకి పెళ్లయినట్టు అబద్ధం చెప్పటం, అతను తనక్కూడా పెళ్లి అయినట్టూకూడా అలాగే చెప్పటం మొదలైన విషయాలన్నీ చెప్పింది.

వివేకానంద దృష్టి కూతురు చేతుల మధ్య ఉన్న పుస్తకం మీద పడింది. ''కొంచెం మంచి నీళ్ళు తీసుకురామ్మా'' అన్నాడు. అనూజ్ఞ అతడి వైపు చిత్రంగా చూసింది. తండ్రి అలా ఎప్పుడూ అడగడు. పక్కగదిలోకి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది. ఆయన తాగుతుండగా ''ఏమిటి నాన్నా ఈ పుస్తకం'' అంది విప్పి చూస్తూ.

''నీ కోసం కార్తికేయ పంపించాడమ్మా. నేనే తీసుకొచ్చాను.''

''ఓ...'' అరిచింది అనూజ్ఞ. ''ఇప్పుడా ఇవ్వటం'' పేజీలు అటూ ఇటూ తిరగేసి చూస్తూ నిష్ఠూరంగా అంది.

మిలమిలా మెరుస్తూన్న కూతురి కళ్ళకేసి చూస్తూ, ''నేను రాగానే ఆస్పత్రికి తీసుకెళ్ళావ్‌గా '' అన్నాడాయన. తన మొహంలో ఏ మాత్రం విషాదం కనిపించకుండా ఉండటం కోసం ఆయన చాలా శ్రమపడవలసి వస్తోంది.

''నేను చెప్పిన విషయం ఏం చేస్తున్నావ్ నాన్నా? అదే కార్తికేయ...''

''చెప్పానుగా. ఈ రోజే వాళ్ళ ఊరు వెళ్తాను...''

''నేను ఫోన్ చేయలేదేం అని కార్తికేయ అడిగితే, దానికో పెద్ద కారణం ఉంది అని చెప్పు. అన్నట్టు క్యాసెట్టు అందిందో లేదో కనుక్కో''

''క్యాసెట్ ఏమిటమ్మా.''

''నీకు చెప్పినా అర్థం కాదులే నాన్నా, వి.ఎల్.ఎల్. అందిందా లేదా అని అడుగు'' నవ్వు ఆపుకుంటూ అంది. వీడియో లవ్ లెటర్ గురించి గుర్తొచ్చేసరికి ఆమె పెదవుల మీద అప్రయత్నంగానే నవ్వు ఉద్భవించింది. తనలో తానే సన్నగా కూనిరాగం తీస్తూ అక్కడి నుంచి వెళుతున్న కూతురివైపు సజల నేత్రాలతో చూశాడు వివేకానంద. అప్పటివరకూ గుప్పెట్లో పెట్టుకున్న కాగితాన్ని నెమ్మదిగా కాళ్ళ దగ్గర ఉన్న పేపర్ బాస్కెట్‌లో వేశాడు. కార్తికేయ దంపతులు అనూజ్ఞకి పంపిన పుస్తకం మొదటి కాగితం అది. అందులోనే ***అనూజ్ఞకి... అభినందనల్తో... కార్తికేయ, కళ్యాణి*** *అని ఉంది.* అది చింపెయ్యటం కోసమే కూతుర్ని నీళ్ళ కోసం పంపాడు ఆయన.

## 6

**టీవీలో** ఒక నది వెన్నెల్లో నిశ్శబ్దంగా కనబడుతోంది. కెరటాలు వెలుతుర్లో మెరుస్తున్నాయి. కెమెరా ముందు ఉన్న అనూజ్ఞ స్వరం మంద్రంగా ''గాలి... తన చేతుల్తో అలవోకగా నదీ కెరటాల్ని నిద్ర లేపినట్టు నీ జ్ఞాపకం నా పెదవుల మీద నవ్వు తెరల్ని కదుపుతోంది...'' అంటూ వినిపిస్తోంది. పది నిమిషాల్లో క్యాసెట్ పూర్తయింది.

''గుడ్...'' అన్నాడు ప్రతాపరెడ్డి సంతృప్తిగా. ''కార్తికేయ వలలో అనూజ్ఞ పూర్తిగా పడిందని చెప్పటానికి ఈ ఋజువులు చాలు. కానీ కార్తికేయ తరపు నుంచి కూడా ఒక ఆధారం కావాలి''.

''సిమ్లాలో వాళ్ళు చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. ముద్దులు పెట్టుకున్నారు'' అన్నాడు సత్యం.

తల అడ్డంగా ఊపాడు ప్రతాపరెడ్డి. ''సరిపోదు. దీన్ని మనం నిరూపిస్తున్నది కోర్టులో కాదు. 'చూడగానే అర్థమయ్యే ఆధారం' కావాలి.''

అశ్వత్థామ అతని వాదనని సమర్థిస్తున్నట్టు ''ఒక ఆధారం దొరికిందిగా. ఇంకొంచెం కాలం ఆగుదాం'' అన్నాడు.

సత్యాన్ని కూడా అనూజ్ఞ అందం వెంటాడుతోంది. ''ఇది ఇంత అందంగా ఉంది. దీని అక్క ఎంత వికృతంగా ఉండేదో''.

''అందుకేగా నీకు పడింది'' ఎగతాళిగా అన్నాడు అశ్వత్థామ.

సత్యం ఛివాలున లేచి, ''నాలుక తెగ్గోసెయ్యగలను'' అన్నాడు.

ప్రతాపరెడ్డి విసుగ్గా ''ఇద్దరూ కొంచెంసేపు కొట్టుకోకుండా నేను చెప్పేది వింటారా?'' అన్నాడు.

ఇద్దరూ ఒకర్నొకరు కోపంగా చూసుకుంటూ తిరిగి కూర్చున్నారు. ''సత్యం చెప్పిన దాన్ని బట్టి అనూజ్ఞ, ఆ కార్తికేయ ప్రేమలో నిండా మునిగి ఉందని అర్థమైంది. మనకి ఒక ఆధారం దొరికింది. ఇట్నుంచి మరో ఆధారం దొరకాలి. అంతే అక్కడితో కథ పూర్తవుతుంది. శ్రీకళ్యాణి మనస్తత్వం నాకు బాగా తెలుసు. ఋజువు దొరికితే భర్త అయినా సరే బయటకు గెంటకుండా వదిలిపెట్టదు. అప్పుడిక మన పని సులువవుతుంది...'' అన్నాడు రెడ్డి.

''పని సులువా? ఎలా?''

''వీళ్ళ ప్రేమ విషయం తెలిసి కార్తికేయని శ్రీకళ్యాణి బయటకు తోలేసిన మరుసటిరోజే ఆవిడ మర్డరు జరిగిందనుకో. అనుమానం కార్తికేయ మీదకు వెళుతుంది. అది చాలదా ఆస్తి సత్యానికి రావటానికి?''

శ్రీకళ్యాణి మీద డబ్బు ఒత్తిడి ఎక్కువ అవసాగింది. బ్యాంకు పూర్తిగా అకౌంట్‌ని ఆపుచేసింది. ఎటూ తోచక ఇక ఈ బాధ్యత కార్తికేయకు అప్పచెబుదామని అతనికి ఈ విషయం చెప్పింది. కార్తికేయకు ముందు అర్థం కాలేదు. ''ఒక బ్యాంకు నుంచి ఇంకో బ్యాంకుకి అకౌంట్ మార్పిడి అయితే ఫర్వాలేదు. అది నేను మాట్లాడగలను. కానీ... సరుకు లేకుండా ఆ రెండో బ్యాంకు మాత్రం అప్పు ఎలా ఇస్తుంది?'' అన్నాడు.

ఆమె నవ్వుతూ ''బ్యాంకు ఛైర్మనూ, బ్రాంచి మేనేజరూ తల్చుకుంటే ఇవ్వగలరు'' అని, అతడేదో చెప్పబోతోంటే చేతులు జోడించి ''మళ్ళీ నాకు పాఠం చెప్పకండి ప్లీజ్'' అంది.

అతడు కూడా నవ్వి ''నేను మరీ మాస్టార్లా కనబడుతున్నానా?'' అన్నాడు.

''మామూలు మాస్టారు కాదు. ఒక చేతిలో బెత్తం, మరో చేతిలో ముక్కుపొడుంతో ముసలి మాస్టార్లా కనపడుతున్నారు.''

''లిట్మస్ టెస్ట్ పెడతావా? నేను ముసలివాడిని కాదని నిరూపించుకుంటాను.''

ఆశ్చర్యంగా ''లిట్మస్ టెస్టా?'' అని అడిగింది.

''అవును. నల్ల లిట్మస్‌ని ఎరుపులోకి మారుస్తాను.''

ఆమెకి అర్థంకాలేదు. ''ఆమ్లం వల్ల నీలి లిట్మస్ ఎరుపు లోకి మారుతుందని చిన్నప్పుడు సైన్సులో చదువుకున్నట్టు గుర్తు. కానీ లిట్మస్ నల్లగా ఉంటుందని నాకు తెలీదే.''

అతడు నవ్వు బిగపట్టి ''నాకూ తెలీదు. థియరీలో తెలుసుకోవటమే'' అన్నాడు. అతడేం మాట్లాడుతున్నాడో, తనేం మాట్లాడుతోందో ఆమెకి అర్థమైంది. రాత్రంతా పూరేకు మడతల్లో నగ్నంగా నిద్రించిన మంచు బిందువు, వెలుగు రాగానే సిగ్గుతో కరిగి నీటి చుక్క అయినట్టు ఆమె మొహం మీద ఘనీభవించి ఉండే గాంభీర్యం కరిగి సిగ్గు తెరలా జారింది. అది క్షణం సేపే. అయితేనేం? అతడిలోంచి చిత్రకారుడు దాన్ని చటుక్కున పట్టుకున్నాడు. ఆమె అద్భుత సౌందర్యవతి కాకపోయినా ఆ క్షణానికి, అతడి వీక్షణానికి, ఆమె సిగ్గు ఒక అపురూప లక్షణంలా తోచింది.

ఆ రోజు అర్ధరాత్రి ఆమెకి మెలకువ వచ్చి చూస్తే అతడు పక్కన లేడు. పక్కగదిలో లైటు వెలుగుతూ ఉండటంతో కొత్త చిత్రం ప్రారంభించాడని గ్రహించింది. అయినా అతడిని ఆ విషయం అడగలేదు. ఒకటి... రెండు... మూడు రోజులు గడిచాయి. పగలు మామూలుగా ఆఫీసుకి వెళ్తున్నాడు. ఇంట్లో ఉన్నప్పుడు ఆమెకి సేవ చేస్తున్నాడు. రాత్రిళ్ళు చాలాసేపు ఆ పెయింటింగ్ గదిలో గడుపుతున్నాడు. తనతో ఉన్నప్పుడు అతడు తన వైపు పరిశీలనగా చూస్తూ ఉండటంతో తన చిత్రమే వేస్తున్నాడని అర్థమైంది. ఆమె మనసు సంతోషంతో పొంగిపోయింది. ఏ భార్యకైనా అంతకన్నా కావల్సింది ఏముంది. చూడాలని బాగా అనిపించేది కానీ అశక్తురాలు కదా. మూడు రోజులయిన తరువాత ఇక ఆగలేక 'నాకా బొమ్మ చూపించరా' అంది.

అతని మొహం వాడిపోయింది. ''వెయ్యలేదు కళ్యాణీ'' అన్నాడు. ఆమె ఆశ్చర్యంగా ''పూర్తి కాలేదా?'' అంది. ''లేదు. ఒక గీత కూడా గీయలేదు.''

ఆమె దిగ్భ్రాంతితో, ''నేను నమ్మను'' అంది. అతడు మౌనంగా పక్క గదిలోకి వెళ్ళి తీసుకొచ్చాడు. అతడు చెప్పింది నిజమే. ఒక్క గీతకూడా లేదు. ఆమె తన కళ్ళని నమ్మలేక పోతోంది. తెలియని భయం, జలదరింపు, సందిగ్ధత అన్నీ కలిసిన స్వరంతో ''మీరు మూడు రోజుల్నుంచీ...'' సందిగ్ధంగా అంది.

ఆమె మాటల్ని అర్థోక్తిలోనే ఆపుచేస్తూ ''ప్రయత్నిస్తూనే ఉన్నాను'' అన్నాడు. ''... కానీ ఎంత ప్రయత్నించినా ఒక్క గీత గీయలేక పోయాను.''

''ఎందుకు?''

''అదే నాకూ  అర్థంకావటం లేదు.''

అతనికి అర్థం కాకపోవటంలో చిత్రమేమీ లేదు. అతడు కళాకారుడు. అందులోనూ చిత్రకారుడు. అందాల్ని పట్టుకోవటమే తప్ప ఆత్మావలోకనం లేదు. కళాకారులు భావుకత్వంతో రమిస్తూ ప్రకృతిలో మమేకమవుతారు. వ్యాపారవేత్తలు ఆశతో మరిగిపోతూ, ఆర్థికంలో కరిగిపోతారు.

తన భర్త తన బొమ్మ ఎందుకు గీయలేకపోయాడో ఆమె ఆ మరుసటి రోజు ఆ దృష్టితో గమనించింది. కేవలం కొద్దిసేపు పరిశీలనతో ఆమెకు అర్థమైపోయింది. అతడు గీయలేకపోవటానికి కారణం...

తనే..!

ఆ కళాకారుడు తన ప్రపంచం వదిలేసి తమ ప్రపంచంలోకి వచ్చేసాడు. తన శరీరపు నిస్తేజ సేవలతో అతడి దినచర్య ప్రారంభమవుతుంది. ఆఫీసుకి వెళ్ళాక ఆ లౌకిక లావాదేవీల్లో మానసిక దినచర్య కలుషితం అవుతుంది. ఇక అతనిలోని ఆర్టిస్టు ఏం జీవించి ఉంటాడు?'

తనకి తెలియకుండానే తనొక కళాకారుడిని 'తమ' స్థాయికి దింపింది. తనకి కళలంటే పెద్ద ఇష్టం లేకపోయి ఉండవచ్చు. కానీ ఒక మనిషి జీవితాన్ని నిర్దేశించే హక్కు (అందులోనూ భర్త జీవితాన్ని నిర్దేశించే హక్కు) తనకి లేదు.

ఆమె అతడికి ఆ విషయమే చెప్పింది.

అతడికి మొదట అర్థంకాలేదు. ''నేను పెయింటింగ్స్ వేయ లేకపోవటానికీ నువ్వు చెప్పేదానికీ ఏమిటి సంబంధం?'' అని అడిగాడు.

''పొద్దున్న లేచిన దగ్గర్నుంచీ మీ జీవితం నా చుట్టూ తిరుగుతూ ఉంది. మామూలు నర్సులు చేయాల్సిన పనికూడా మీరు చేస్తున్నారు. ఇక ఆఫీసుకి వెళితే ఏ పని ఏ లౌక్యంతో చేయాలా అన్న ఆలోచనే సరిపోతుంది. ఆర్టిస్టుకి కావల్సిన సమయం, లేతదనం, స్వచ్ఛతా మీకు దూరమయ్యాయి. అందుకే మీరు గత మూడు రోజుల్నుంచీ ఒక్క గీత గీయలేక పోయారు.''

''నేను బొమ్మలు వేయటానికీ, నా సమయానికీ సంబంధంలేదు. మండుటెండలో చెట్టు క్రింద చెప్పులు కుట్టుకునే రోజుల్లో కూడా నేను తెల్లవారుజాము వరకూ బొమ్మలేసేవాడిని.''

''ఎందుకంటే అప్పుడు మానసికంగా మీ మీద ఏ విధమైన ఒత్తిడిలూ లేవు.''

''లేవని నువ్వు ఎందుకు అనుకుంటున్నావు?''

ఆమెకు చిరాకు పెరిగిపోతోంది. అతనిమీద కాదు. తనమీద తనకే. ఆ చిరాకులో స్వరం హెచ్చించి అన్నది. ''నేను అనుకున్నది ఎప్పుడూ తప్పు కాదు.''

''నువ్వు అనుకున్నదెప్పుడూ తప్పు కాదనుకుంటే, బొమ్మలెయ్యటం మానేసి ఆ నర్సులు చేయవలసిన పనులన్నీ నేను చేస్తున్నానని ముందే ఎందుకు తెలుసుకోలేకపోయావు.''

''చెప్పానుగా ఒక రకమైన మత్తులో ఉన్నానని.''

''అంటే నువ్వు అనుకునేదంతా నిజం కాదనీ, అప్పుడప్పుడు మత్తులో ఉంటావని నిరూపణ అయిందిగా.''

ఆమె ఇరిటేటింగ్‌గా ''అవును అయింది. అందుకే దాన్ని సరిదిద్దుకోవాలనుకుంటున్నాను'' అంది. పాలు తీసుకొచ్చిన పనిమనిషి, ఈ అరుపులకి క్రిందికి వెళ్ళిపోయింది. భార్యాభర్తలు ఇలా మొట్ట మొదటిసారి గొడవ పడటం పనివాళ్ళకి కొత్తగా ఉంది.

తాను కూడా స్వరం పెంచి మాట్లాడానని కార్తికేయ గుర్తించాడు. వచ్చి పక్కన కూర్చుంటూ ''నన్నేం చేయమంటావో చెప్పు కళ్యాణీ'' అన్నాడు.

''ఒక్క విషయం గుర్తించమంటున్నాను. ఇది ఇలాగే కొనసాగితే మీలో ఆర్టిస్టు పూర్తిగా చచ్చిపోతాడు.''

చాలాసేపు నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అతడు నెమ్మదిగా ''ఇదంతా నువ్వు ఒక మనిషి మరో వ్యక్తితో మాట్లాడుతున్నట్లు చెపుతున్నావా? ఒక భార్య భర్తకి చెపుతున్నట్లు మాట్లాడుతున్నావా?'' అని అన్నాడు.

ఆమె కన్ఫ్యూజ్ అయి ''రెండింటికీ తేడా ఏమిటి?'' అడిగింది.

''నాకే కాలో విరిగి, నెలరోజులు ఆస్పత్రిలో ఉండ వలసి వచ్చిందనుకో. ప్రొద్దున్నే కాఫీ ఫ్లాస్కు పట్టుకొచ్చి ఇచ్చేసి ఆఫీసుకి వెళ్ళిపోతావా? నాతోపాటు ఉంటావా?''

ఆమె చప్పున తలెత్తింది. దాన్ని పట్టించుకోకుండా అతను కొనసాగించాడు. ''...ఖరీదయిన ఆస్పత్రి, రోజుకి అయిదువేలు బిల్లు, నలుగురైదుగురు నర్సులు, నగరంలో కెల్లా పెద్ద డాక్టరూ... అందర్నీ ఏర్పాటు చేస్తావు. అనుమానం లేదు. కానీ, అన్నీ ఉన్నా కూడా రాత్రీ పగలూ నా పక్కన నువ్వూ ఉంటావు. చెప్పు ఉంటావా? ఉండవా?''

ఆమె తల దించుకుంది. అతడు ఆమె తలమీద చెయ్యివేసి ''ఎందుకంటే అది ప్రేమ. ప్రేమ కన్నా గొప్పదేదీ లేదు కళ్యాణీ..! చివరికి 'కళ' కూడా ప్రేమ కన్నా చిన్నదే..! అందుకే నన్ను నీ నుంచి దూరం చేయకు'' అన్నాడు.

ఆమె కళ్లు మూసుకుంది. అతడు వెళ్తోన్న అడుగుల చప్పుడు తెలుస్తోంది. ఆమె కళ్లు తెరవలేదు. అతడి మాటలే చెవుల్లో మార్మోగుతున్నాయి. ''ఖరీదైన హాస్పటలు, రోజుకి అయిదు వేలు బిల్లు, నలుగురైదుగురు నర్సులు, నగరంలోకెల్లా పెద్ద డాక్టరూ అన్నీ ఉన్నాకూడా నువ్వు పగలూ, రాత్రీ నా పక్కన ఉంటావు. చెప్పు... ఉంటావా? ఉండవా?''

ఉండను.

ఆ ఊహకే మనసు వణికింది. అయినా 'ఎలా ఉండగలను? హాస్పిటలు, నర్సులూ, డాక్టర్లూ, అన్నీ కావాలంటే డబ్బు కావాలి కదా. అక్కడ ఎలా ఉండగలను?' అనుకుంది.

ఈ మాట పైకి అంటే సమస్త నారీలోకమూ, మహా పతివ్రతలూ తనని 'ఛీ' కొడతారు. కళ కన్నా ప్రేమ గొప్పదే కానీ ప్రేమ కన్నా 'జీవితం' ముఖ్యం... ఇరవై నాలుగ్గంటలూ శుశ్రూష చేస్తూ మధ్య మధ్యలో పైటకొంగుతో కళ్ళు తుడుచుకుంటూంటే అందరూ సంతోషిస్తారంటే అలా చేయటానికి తనకేమీ అభ్యంతరంలేదు. కానీ ఒక పదం ఉన్నదే – ఒక పదం – నిజమైన వ్యాపారవేత్తకి కావల్సింది. అదే ఈ ప్రపంచంలో చాలా కొద్దిమందిని మిగతావారి నుంచి వేరు చేస్తుంది. ఆ పదం పేరు 'డిటాచ్‌మెంట్'.

ఇంట్లో గొడవలన్నీ సూట్‌కేసులో పెట్టుకొని ఆఫీసుకి తీసుకువెళ్ళేవాడు ఎవరూ మంచి వ్యాపారవేత్త కాలేరు. దాన్నే డిటాచ్‌మెంట్ అంటారు. అలాగే, తన వ్యక్తిగత వ్యధలన్నీ ఎక్కడో మనసు పొరల్లో దాచేసుకొని ఏకాగ్రతతో దృష్టి పెట్టలేనివాడు ఎవరూ కళాకారుడు కాలేరు. ఈ రెండూ ఒకటే అనుకుంటే కళాకారుడికీ, వ్యాపారవేత్తకీ పెద్ద తేడా లేదు. వ్యాపారవేత్తకే కాదు. కళాకారుడికి కూడా డిటాచ్‌మెంట్ కావాలనన్న చిన్న విషయం కార్తికేయ ఎందుకు తెలుసుకోదు?

(కొనసాగింపు వచ్చే నెలలో)